
క్లుప్తంగా

నేడు విగ్రహాల ప్రతిష్ట


జోడు మారెమ్మదేవి ఆలయం

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన జోడు మారెమ్మదేవి ఆలయంలో శుక్రవారం వేకువజామున విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ సర్పంచు సురేంద్ర, గ్రామస్తులు గురువారం తెలిపారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ముత్యాలమ్మదేవి ఆలయంఒ విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. దాతలిచ్చిన విరాళాలతో నూతన ఆలయాలు నిర్మించినట్లు వారు తెలిపారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని గురువారం ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి హాజరవుతారని వారు తెలిపారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

కుందుర్పి: మండలంలోని వివిధ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న దళిత సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘం నాయకులు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెలిమప్ప, సతీష్, మూర్తి, మల్లికార్జున, నగేష్, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

తిప్పనపల్లిలో 'కార్డెన్ సెర్చ్'


తనిఖీ చేస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

సెట్టూరు: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు గ్రామమైన తిప్పనపల్లిలో డీఎస్పీ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున గ్రామంలో అనుమానిత స్థలాల్లో సోదాలు చేపట్టారు. సీఐ శ్రీనివాసులు, ఎక్సైజ్ సీఐ మోదీన్‌బాషా, ఆరుగురు ఎస్‌ఐలు, 50 మంది పోలీస్ బెటాలియన్‌తో గ్రామంలో అణువణువూ జల్లెడపట్టారు. గ్రామంలోని రౌడీ షీటర్లు, మద్యం కేసుల నిందితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంగస్వామి అనే వ్యక్తి 96 టెట్రా మద్యం ప్యాకెట్లతో పట్టుబడ్డాడు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు యువరాజ్, రాజేష్, నాగమధు, పరుశురాముడు, సుధాకర్, కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మాశాలీయ సంఘం సెక్రటరీగా రాజు



రాయదుర్గం: అఖిల భారత పద్మశాలీయ సంఘం సెక్రటరీగా రాయదుర్గం పట్టణానికి చెందిన పొరాళ్ల రాజును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఆ సంఘం ప్రెసిడెంట్ కస్దగట్ల స్వామి పద్మశాలి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలీయ సంఘ సమావేశంలో కుల పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడుతానన్నారు. రాయదుర్గంలోని పద్మశాలీయ సంఘు సభ్యులు అతడిని అభినందించారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు గ్రామంలో వజ్రకరూరు–విడపనకల్ ప్రధాన రహదారి పక్కన సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. 41 రోజులపాటు మజ్జిగ కేంద్రం నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు.

వైభవంగా హులిగమ్మ విగ్రహ ఊరేగింపు


విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో హులిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా గురువారం హులిగమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకం, చండీహోమం, చండీ పారాయణం, మహాస్థాపనము, దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం 101 కలశాలతో డప్పు వాయిద్యాల నడుమ హులిగమ్మ అమ్మవారి విగ్రహం, కలశాన్ని గ్రామంలో ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, కలశ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కమనీయం.. నారసింహుని కళ్యాణం


కళ్యాణదుర్గం: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహుడు


రాయదుర్గం రూరల్: శాంతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక కోట వీధిలోని లక్ష్మీ నరసింహ ఆలయంలో గురువారం స్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. వేకువజామునే స్వామి మూలమూర్తులను ప్రత్యేకంగా అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం 7 గంటలకు మూల విగ్రహానికి అభిషేకం, 10 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం పరిధిలో విప్రమలై లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యస్వామి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, బలిహరణ నైవేద్యం పూజలు చేపట్టారు. అనంతరం లక్ష తులసి అర్చన, శాంతహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని లక్ష్మీనృశింహ స్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ఉద్వాయం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, వైస్‌ఎంపీపీ శ్రీలక్ష్మి తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


కళ్యాణదుర్గం: శేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత నరసింహుడు


రాయదుర్గం రూరల్: లక్షతులసీ అర్చనలో లక్ష్మీ నరసింహస్వామి


కుందుర్పి: అలంకరణలో నరసింహస్వామి

తిమ్మాపురం నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ మంగమ్మ

ఉరవకొండ(కూడేరు): కూడేరు మండలంలోని తిమ్మాపురంలో ఉన్న లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో గురువారం నృసింహుడి జయంతి వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణోత్సవం చేపట్టారు. ఎమ్మెల్సీ మంగమ్మ హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానిస్తున్న ఈఓ, ప్రధాన అర్చకుడు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు రావాలని గురువారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దంపతులను ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథచార్యులు ఆహ్వానించారు. అనంతపురంలోని ఆయన నివాసానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే, ఆయన సతీమణి భువనేశ్వరికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వారు అందించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 10న జరిగే బ్రహ్మరథోత్సవానికి హాజరుకావాలని కోరారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిరిడీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం, అభిషేకాలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అ నంతరం మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పారా విశ్వనాథ్(చిట్టెన్న) అర్చకుడు అనంతస్వామి, ఆలమ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వేంకటరమణుడు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ప్రసన్న వేంకటరమణసామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం శ్రీవారిని సింహవాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ధ్వజారోహణ, యాగశాల ప్రవేశ, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి సింహ వాహన ఊరేగింపు యాదవ, కురుబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద నుంచి కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు మీదుగా నేసేపేట బొడ్డురాయి వరకు కొనసాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, యాదవ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం సూర్యప్రభవాహనం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి


రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ రజాక్‌వలీ, ఏఓ శ్రవణ్‌కుమార్

కణేకల్లు: ఈనెల 7 వరకూ వర్షాలొచ్చే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రజాక్‌వలీ, వ్యవసాయాధికారి ఎ.శ్రవణ్ కుమార్ సూచించారు. కణేకల్లులోని చిక్కణ్ణేశ్వరస్వామి చెరువు కింద, బోర్ల కింద రైతులు సాగు చేసిన వరి పంటలు కోతకొచ్చాయి. కొందరు రైతులు కోతలు పూర్తి చేసి వరిధాన్యాన్ని రాసులుగా పోసుకోగా... అనేక మంది రైతులు యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. ఈనేపథ్యంలో కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు ఇక్కడి అధికారులు పొలాలకెళ్లి రైతులను అప్రమత్తం చేస్తున్నారు. వరికోతలను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. పొలాల్లో వరి కంకులు వర్షానికి తడిచినా, రాసులు పోసిన వరిధాన్యం వర్షానికి తడిచినా 10 గ్రాముల ఉప్పు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా చేస్తే వరి మొలకెత్తదని రంగు కూడా మారదన్నారు. వరి రాసులు పోసుకొన్న రైతులు ఆకాశం మేఘావృతమైనట్లు కన్పిస్తే వెంటనే టార్పాలిన్ కప్పాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం రాసులు వేసుకోవద్దన్నారు. వరదనీటికి వరిరాసులు కొట్టుకుపోయే ప్రమాదముంటుందన్నారు.

ఐకమత్యంతో ఆలయ నిర్మాణం పూర్తి

- నేటి నుంచి ప్రతిష్ట కార్యక్రమాలు


దేవాలయం వద్ద ప్రారంభోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎక్కేల గోత్ర వంశీయులు

బెళుగుప్ప: ఐకమత్యంతో సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు బెళుగుప్పలోని భీమలింగేశ్వరస్వామిని కులదైవంగా భావించే ఎక్కేల గోత్ర వంశోద్భవ కురుబలు. మండల కేంద్రంలోని నడిబొడ్డున అర సెంట్ విస్తీర్ణంలో బెళగల్లేశ్వరస్వామి దేవాలయం ఉండేది. 2015లో సమావేశం నిర్వహించి నూతన దేవాలయానికి కొంత నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న స్వామి భక్తులు కొందరు ఉచితంగా తమ గృహాలను ఇవ్వగా మరికొందరు ఆలయ నిర్మాణానికి సహకరిస్తామంటూ కొంత నగదుతో ముందుకు వచ్చారు. 15 ఇళ్ల యజమానులు ఆలయ నిర్మాణానికి సహకరించడంతో సుమారు 20 సెంట్ల స్థలంలో రాతి ఆలయం నిర్మించాలని తలపెట్టారు. ఎక్కేల గోత్ర కుటుంబసభ్యులు దాదాపు రూ.1.2 కోట్ల నిధులు ఖర్చు చేసి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఎక్కేల కుల గురువు గోవిందవా మృత్యుంజయ వడయార్ నేతృత్వంలో మదన్‌మోహన్‌శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. గురువారం ఆలయ సేవా కమిటీ సభ్యులు బి.శివలింగప్ప, రుద్రన్న, తిప్పేస్వామి, బెళగల్లప్ప, హనుమంతప్ప, లింగన్న, పోతన్న, ప్రభాకర్ తదితరులు ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్లను విడుదల చేశారు.

25 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

కళ్యాణదుర్గం: మండలంలోని హులికల్లు గ్రామానికి చెందిన రాజప్ప అనే వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం 25 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో గురువారం గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదర్శభారతి సొసైటీ ద్వారా మెరుగైన సేవలు


షాపింగ్ కాంప్లెక్స్ భవనాలను ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: ఆదర్శభారతి సొసైటీ ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందిస్తామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. కణేకల్లులో ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం రూ.45 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనాలను జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ జితేంద్రమిశ్రా, చీఫ్ మేనేజర్ కె.గోపన్న, లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగరాజురెడ్డి, సొసైటీ అధ్యక్షులు కె.ప్రకాష్‌రెడ్డి, ఎండీ మనోహర్‌తో కలిసి విప్ కాపు గురువారం ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ రైతులకు సేవలందించడమే ధ్యేయంగా 1977లో ఏర్పాటైన ఈ సొసైటీ అంచెలంచెలుగా అభివృద్ధి సాధించి జిల్లాతోపాటు రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతి గడించిందన్నారు. 10 గదుల నిర్మాణానికి రూ.55 లక్షల వరకూ ప్రతిపాదనలు సిద్ధం చేసి రూ.45 లక్షలకే పూర్తి చేయడం హర్షణీయమన్నారు.

ఏటా రూ.26 కోట్ల టర్నోవర్

ఆదర్శభారతి సొసైటీలో ఏటా రూ.26 కోట్ల టర్నోవర్ చేస్తున్నట్లు అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, ఎండీ మనోహర్ తెలిపారు. రూ.11 కోట్లు పంట రుణాలు, రూ.3 కోట్లు గోల్డ్ లోన్లు, రూ.4 కోట్లు మీడియం టర్మ్‌లోన్లు, రూ.4కోట్లు సేవింగ్ అకౌంట్ టర్నోవర్, మరో కోటి రైతుల షేర్లున్నాయని మిగిలిన డబ్బును మార్క్‌ఫెడ్, ఇన్ఫోసిస్ షేర్లలో పెట్టామన్నారు. కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సలతో ఏటా అదనంగా రూ.5 లక్షల ఆదాయం రానుందన్నారు. రైతుల వినతి మేరకు తక్కువ వడ్డీతో రుణాలిచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతానని విప్ తెలిపారు. అనంతరంఆదర్శ భారతి సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటాన్ని విప్ కాపు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా అధికారులతో కలసి ఆయన పాటిల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాటిల్ సేవలను అందరూ స్మరించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు,మార్కెట్‌యార్డు చైర్మన్ భోజరాజనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, కార్యదర్శి ఆదినద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, డాక్టర్ సోమన్న, నాయకులు వేమన, యంద్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, అజ్మతుల్లా, చిన్న సర్మస్, భాస్కర్‌రెడ్డి, ఫణీంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ స్థాయి కంట్రోల్ రూం ఏర్పాటు

కళ్యాణదుర్గం: జిల్లాలో వర్ష సూచన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా సంభవించే ప్రాణ, పశు, ఆస్తి నష్టం వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూంకు తెలియజేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులను వంకలు, బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాలైన కంబదూరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం వల్ల గ్రామాల్లో ఏదైనా నష్టం ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూం నంబర్లు 8099374747, 9493366844కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

వడ్డీతో రుణాలు రెన్యూవల్ చేయాలి

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో వడ్డీ కట్టించుకొని పంట రుణాలు రెన్యూవల్ చేయాలని మండల రైతు సంఘం నాయకులు బ్యాంక్ ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని బ్యాంకుల్లో వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేస్తున్నారని, ఎనుములదొడ్డి బ్యాంక్‌లో వడ్డీ, అసలుతో రెన్యూవల్ చేయడమేమిటని ప్రశ్నించారు. కేవలం వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరిదాసు, గోపాల్, శివలింగప్ప, సహాయ కార్యదర్శి వై.గోపాల్ రైతులు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యలు ప్రారంభం


సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: వర్షాలతో లోతట్టు కాలనీలు ముంపునకు గురికాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రధాన కాలవల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. కొలిమివీధి, పాత మీసేవా సెంటర్ ఏరియా, రామస్వామి వీధి, పుట్టప్ప తోట వరకు వచ్చే ప్రధాన కాలవలో పూడికతీత చేపట్టనున్నారు. గురువారం పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు భావన స్కూల్ వద్ద ఉన్న ప్రధాన కాలవ నుంచి పూడికత తీత పనులను జేసీబీతో ప్రారంభించారు. పనులను మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. నాలుగైదు రోజుల పాటు జేసీబీతో పూడిక తీయించి అనంతరం మ్యాన్యువల్‌గా పూడిక తీసే కార్యక్రమం జరుగుతుందన్నారు. దాదాపు 20 రోజుల పాటు పనులు చేపడతామన్నారు. పూడిక తీత పనులను పర్యవేక్షించాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది, మేస్త్రీలకు ఆయన సూచించారు. విప్ ఆదేశాలతో పూడికతీత పనులను టెండర్లు పిలిచి ప్రారంభించామన్నారు. అంతేకాక ముంపు ప్రాంతాల్లో గడప గడప కింద నాలుగు చోట్ల కల్వర్టుల నిర్మాణానికి కూడా వర్క్ ఆర్డర్లు మంజూరయ్యాయన్నారు.

కంకర వాహనం సీజ్


టిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులోని కొండల నుంచి కంకరను బళ్లారికి తరలిస్తుండగా గురువారం అనంతపురం విజిలెన్సు సీఐ రామారావు ఓ టిప్పర్‌ను సీజ్ చేశారు. బళ్లారికి చెందిన టిప్పర్ ఓవర్‌లోడ్‌తో కంకర తరలిస్తుండగా సీజ్ చేశామని సీఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కళ్యాణదుర్గం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అబ్దుల్ ఖాదీర్ సూచించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి, దొడగట్ట గ్రామాలలో గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు ఆదేశాల మేరకు హెల్త్ క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరి, వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శి గణేష్, హెల్త్ సెక్రటరీ సరస్వతి, ఇందిరమ్మ, వలంటీర్లు, ఆశా వర్కర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా మట్కా, క్రికెట్ బెట్టింగ్..!

▸▸ కళ్యాణదుర్గం మండల కేంద్రానికి చెందిన ఓ ఆటోడ్రైవర్‌కు దినసరి కూలీ రూ.700 వస్తోంది. ఇందులో సాయంత్రానికి ఆన్‌లైన్ మట్కా కోసం రూ.100 నుంచి రూ.200 ఖర్చు చేస్తున్నాడు. ఇలా రోజువారీ సంపాదనలో కొంత మట్కాకే నిర్వహిస్తూ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నాడు.

▸▸ కళ్యాణదుర్గంలో ఇటీవల ఇద్దరు యువకులు రూ.10 వేలు క్రికెట్ బెట్టింగ్ వేసుకున్నారు. క్రికెట్ మ్యాచ్ ముగిసిన మరుసటి రోజు డబ్బు చెల్లించకపోవడంతో బజారులోనే ఇద్దరు కొట్టుకునే స్థాయికి వెళ్లారు. చుట్టపక్కల వాళ్లు ఆరా తీయగా క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు ఇవ్వలేదని గొడవకు దిగినట్లు తెలిసింది.

కళ్యాణదుర్గం: పట్టణంలోని గాంధీ చౌక్, కొల్లాపురమ్మ గుడి, బళ్లారి మిట్ట, మారెంపల్లి కాలనీ, వాల్మీకి సర్కిల్‌లు జూదాలకు అడ్డాలుగా మారాయి. కొందరు మట్కాలో ఆరితేరిన పట్టణవాసులు మట్కా పట్టీలను బహిరంగంగా రాస్తూ అమాయక జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇందులో కొందరు మహిళలు ఉండటం విశేషం. మరికొందరు ఆటోవాలాలు, దినసరి కూలీలు, యువకులు సైతం సెల్‌ఫోన్లలో ప్రత్యేక యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుని జోరుగా ఆన్‌లైన్ మట్కాను ఆడుతూ మోసపోతున్నారు. వీటితో పాటు ఇటీవల క్రికెట్ బెట్టింగ్, వాహనాల నంబర్లు వంటి వాటిపై యువత జోరుగా పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒక్క కళ్యాణదుర్గం పట్టణంలోని మట్కా, క్రికెట్ బెట్టింగ్, ఇతర జూదాలతో రోజుకు రూ. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నట్లు వినికిడి. జూదాల వ్యవహారం భారీగా నడుస్తున్నా పోలీసులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి. నిర్మూలించాల్సిన ప్రత్యేక పోలీసు విభాగం సిబ్బంది ముడుపులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటిని నిర్మూలించాల్సిన పోలీసులు తమ సొంత వ్యాపారాలపై దృష్టి పెట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు పోలీసులు విధులకు డుమ్మా కొడుతూ నిత్యం రియల్ ఎస్టేట్ రంగంపైనే దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

ప్రత్యేక నిఘా ఉంచాం



కళ్యాణదుర్గంలో మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఇప్పటికే ప్రధాన కూడళ్లలో సాయంత్రం సమయంలో గస్తీ పెంచాం. ఆన్‌లైన్‌లో అధిక మంది మోసపోతున్నారని తెలిసింది. మట్కా, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. విధుల పట్ల పోలీసు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదు. మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటి వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తాం.

– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం